ప్రజాశక్తి

శనివారం 15 జూన్ 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఈ హెచ్ఎస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం జరిగింది. అదాని మెడికల్ సెంటర్, నెల్లూరు కిమ్స్ ఆస్పత్రిలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి సీఓఓ రాజన్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆరోగ్యమే మహా భాగ్యం" అన్న చందంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ మెగా వైద్య శిబిరంలో జనరల్ విభాగంతో పాటు గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజు, రవికిరణ్, ఈహెచ్ఎస్‌హెడ్ వేణు గోపాల్‌రెడ్డి, మనీష్ దావే, నాగరాజు, జయలాల్, వెంకట్రావు, ఈహెచ్ ఎస్ డిపార్ట్‌మెంట్ కె.రాంబాబు, ఎం.శ్రీనివాస్, ఐ.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఓఓ రాజన్ బాబు

'ఆనం'కు దేవాదాయశాఖేనా..!

- పెదవి విరుస్తోన్న అనుచరులు, ప్రజలు
- 'నారాయణ' కు మళ్లీ అవే బాధ్యతలు
- మంత్రులకు శాఖల కేటాయింపులు

రాష్ట్ర ప్రభుత్వంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మంత్రులకు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు శాఖలు కేటాయించారు. సీనియర్ నాయకులు ఆత్మకూరు ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డికి దేవాదాయశాఖ కేటాయించారు. దీనిపై ఉస్ అంటేనే అంటూ జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి ఒక్క శాఖ, అది దేవాదాయం ఇవ్వడంపై ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు నగర ఎంఎల్ఎ పి నారాయణకు అందరూ ఊహించిన విధంగానే గతంలో చేసిన పురపాలక, అర్బన్ డెవలప్‌మెంట్‌శాఖలు కేటాయించారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర మంత్రి వర్గంలోని ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణకు శాఖలు కేటాయించారు. నెల్లూరు నగరం నుంచి భారీ విజయం సొంతం చేసుకున్న పి.నారాయణకు అందరూ ఊహించిన విధంగా పురపాలక, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలు ఇచ్చారు. 2014లోనూ ఆయన అదే శాఖలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీలు, నగరాలకు అభివృద్ధి చేశారు. నెల్లూరు నగరంలో సుమారు రూ.5,200 కోట్లతో రోడ్లు, పార్కులు, వాటర్ స్కీమ్, భూగర్భ డ్రెయినేజీ చేశారు. అమరావతి భూసేకరణ, నిర్మాణాలు విషయంలోనూ నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపించారు. అందులో భాగంగానే మళ్లీ అమరావతి అభివృద్ధి చేయడానికి నారాయణకు ఆ శాఖలు కేటాయించినట్లు సమాచారం. ఇది తొలి నుంచి జిల్లా ప్రజలతోపాటు, ఆయన అనుచరులు అందరూ ఊహించిందే కావడంతో పెద్దగా ఎవరూ ఆతృత చూపలేదు. నారాయణ శాఖలకు రావడంతో నగరంలోని రోడ్లు, పార్కులు పూర్తి చేయడంతోపాటు, సుమారు రూ.1150 కోట్లతో

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

80 శాతం పనులు పూర్తి చేసిన చివరిలో నిలిచి పోయిన భూగర్భ డ్రెయినేజీ, వాటర్ స్కీమ్‌లు పునఃప్రారంభించి పూర్తి చేస్తారని నెల్లూరు నగర వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అమరావతితోపాటు, నెల్లూరు జిల్లాలోనూ మున్సిపాలిటీలు, నెల్లూరు నగర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాల్సి ఉంది. సీనియర్ నాయకులు ఆనం రామనారాయణరెడ్డికి మంత్రి వర్గంలో స్థానం కల్పించడం అందరినీ ఆశ్చర్యం కలిగిస్తే, ఆయనకు కేటాయించిన దేవాదాయశాఖ పట్ల ఆయన అనుచరులు, ప్రజలు ఉస్ అంటేనే అంటూ పెదవి విరుస్తున్నారు. ఆయన 1985 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, మంత్రివర్గాల్లో కీలకమైన మంత్రి పదవులు చేశారు. అనేక విషయాల పట్ల అవగాహన ఉంది. అయనకు దేవాదాయశాఖ కేటాయించడం ఏమిటనే ప్రశ్న వస్తుంది. ఇవాల్సి వచ్చి ఇచ్చినట్లు ఉందని కొందరు

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అంటున్నారు. 1983-85లో ఎన్‌టి రామారావు వద్ద ఆర్అండ్‌బి మంత్రిగా పనిచేశారు. 2007-09లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద సమాచార, పౌర సరఫరాల శాఖ మంత్రిగాను, 2012-14లో ఇద్దరు ముఖ్య మంత్రులు కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య మంత్రి వర్గంలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో దేవాదాయశాఖ కేటాయిం చారు. ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసిన ప్రముఖుల్లో ఆనం రామనారాయణ ఒకరు. ఎదొకటి వచ్చిందని ఆనం అనుకుండగా ఆయన అనుచరులు మాత్రం చిన్న శాఖ, ఒకే శాఖ ఇవ్వడం పట్ల ఆసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా జిల్లాకు ఇద్దరు మంత్రులను కేటాయించడం పట్ల వారి అనుచరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాల వలే రెండున్నర సంవత్సరాలకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అందరూ భావిస్తున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..

16న 'శింగమనేని', 'గట్టమనేని' సంస్మరణ సభ

ప్రజాశక్తి-నెల్లూరు

నేత్రదాతలు, దేహ సమర్పకులు శింగమనేని అనంతలక్ష్మి, గట్టమనేని శ్రీరాములు సంస్మరణ సభ ఈ నెల 16న ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఎస్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని దర్గామిట్ట, పోలీసు కాలనీలో దక్షిణం రోడ్డు కరెంటు ఆఫీసు వద్ద ఈ సభ జరుగుతుం దన్నారు. మానవ సమాజ వికాసానికి పనికి వచ్చే భౌతిక కాయాన్ని, అవయవాలను వైద్యరంగానికి దాన మిచ్చేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రజలు ముందుకు రావాలని, ఈ విషయాలపై అవగాహన కల్పిం చేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వక్తలుగా బాలచంద్ర, అబ్బాయిరెడ్డి, దయానంద్, వెంకటేశ్వర్లు, విజయ, బ్రహ్మం, ప్రొఫెసర్ ఆశాలత, స్నేహలత, ప్రొఫెసర్ కాశీం, మాల్యాద్రి, సుకుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్ఎ ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు కందుకూరు సబ్ కలెక్టర్ జి.విద్యాధరిని శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కందుకూరు నియోజకవర్గ విషయాల గురించి చర్చించారు.



ఎంఎల్ఎ ఇంటూరిని కలిసిన కో ఆర్డినేటర్లు

ఎంఎల్ఎ ఇంటూరిని కలిసిన కో-ఆర్డినేటర్లు

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు మండలాల నుంచి మెడ బలిమి రమణయ్య ,ఉలవపాడు మండలం నుంచి ఎండ్లూరి ఏసోబు, లింగసముద్రం మండలం నుంచి ఎండ్లూరి కొండయ్య ,గుడ్లూరు మండలం గుండి టి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

కోవూరులో పారిశుధ్యం అధ్వానం..

ప్రజాశక్తి-కోవూరు: పట్టణంలోని బజార్‌సెంటర్, వడ్డిపాలెం, మసిగానితోట ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. సైడు కాలువల్లో మురుగు, చెత్తను సక్రమంగా తొలగించడంలేదు. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అదే విధంగా దోమలు విపరీతంగా ఉంటున్నాయి. సైడు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాల్సి ఉంది. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య మెరుగునకు కృషిచేయాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

మరో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి కోవూరు/ సంగం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు..మరో ఇద్దరికి తీవ్ర గాయాలు. ఈసంఘటన నెల్లూరు జిల్లాలోని కోవూరు, సంగం మండలాల్లో శుక్రవారం చోటు చేసు కున్నాయి.పోలీసుల సమాచారం మేరకు..చిత్తురు నుంచి మామిడి కాయల లోడుతో గుంటూరు మార్కెట్‌కు మినీ లారీ వెళ తోంది. కోవూరు పట్టణంలోని చౌదరి పెట్రోల్ బంకు జాతీయరహదారి పక్కన ఆగిఉన్న కంటైనర్‌ను మినీ లారీ వెనుకవైపు నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కోవడం జరిగింది. స్థానికులు గుర్తించి అతన్ని బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే డ్రైవర్ మతి చెందాడు.క్లీనరుకు స్వల్ప గాయాలయ్యాయి. మతుడు డ్రైవర్ మొగిలి సతీష్(30) చిలకలూరిపేట మండలం, కావూరు గ్రామం, ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంగం మండలం దువ్వూరు వద్ద జాతీయ రహదారిపై వేకువజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి సీతారామపురం వైపు వెళ్తున్న ఓ పేపర్ వ్యాన్ అకస్మాత్తుగా రోడ్డుపై అడ్డుగా వచ్చిన గేదెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు(48) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవర్ శ్రీనివాసులు(50)108లో వెళుతూ మార్గమధ్యలో మతి చెందారు.వ్యానులో ఉన్న ఓ మహిళకు, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతుల్లో నాగరాజు అనే వ్యక్తి సంగం మండలం ఎస్‌విఆర్ పురం గ్రామం, డ్రైవర్ శ్రీనివాసులు ది వెంకటేశ్వర పురంగా గుర్తించారు. మృతదేహాలను పంచనామాకు తరలించారు.

కోవూరు జాతీయ రహదారిపై నుజ్జునుజ్జయిన లారీ

సంగంలో మృతిచెందిన దృశ్యం

19,20 తేదీల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రప్రభుత్వం రబీ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరవు పరిస్థితిని అంచనా వేయడానికి ఈనెల 19,20 తేదీల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటిం చనున్నట్లు కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పశు సంవర్థక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్ శర్మ ఆధ్వర్యంలోని ఉన్నతాధికారులు మన్ను జి ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో కరవు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో కేంద్ర బృందం పర్యటనకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరవు నష్టాన్ని వివరించేలా ఫొటో ఎగ్జి బిషన్ ఏర్పాటు, పవర్‌పాయింట్ ప్రజం టేషన్, పరిశీలించే ప్రాంతా లకు సంబంధించి రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేయాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి

ఖాళీల ఆధారంగానే స్థాన చలనం

ప్రజాశక్తి-నెల్లూరు: పోలీసు శాఖలో సిబ్బంది బదిలీలు పారదర్శకతతో నిర్వహిస్తామని, ఖాళీల ఆధారంగా సిబ్బంది కోరుకున్న చోటుకు బదిలీలు చేస్తామని ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే ' కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది నుంచి వినతిపత్రాలను నేరుగా స్వీకరించారు. అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారు. అనంతరం పారదర్శకతతో కోరుకున్న చోటుకే ఖాళీల ఆధారంగా సిబ్బందికి స్థాన చలనం కలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, అదే సమయంలో సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, ఎవరైనా అనధికారికంగా గైర్హాజరయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల అర్జీలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిపిఒ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. బదిలీలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుంచి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్యం కారణంగా బదలాయింపు సంబంధిత అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించామన్నారు. సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

బీట్ వ్యవస్థ పటిష్టంగా అమలు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణలో భాగంగా బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు సమర్థవంతమైన రాత్రి బీట్లు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక గ్రామాలలోని స్థానికులతో సమావేశాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించామన్నారు. నగర పరిధిలో పూర్తి స్థాయిలో పోలీసులు రాత్రి గస్తీ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంతలలో ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసికెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామాలలో ఏటువంటి ఘటనలకు అవకాశం లేకుండా శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవనం సాగించేందుకు పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలో అనుమానిత వ్యక్తులను చూసినా, గస్తీ తిరిగే సమయంలో ఎదురైన వారి ప్రవర్తన పై అనుమానం వచ్చిన వెంటనే వారి వేలిముద్రలు సేకరించాలన్నారు. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్లు, రైల్వే స్టేషన్, బస్టాప్‌లు, ఆలయాలు, బ్యాంక్లు, ఎ.టి.ఎంలు, అన్ని ముఖ్యమైన కూడళ్లలో నిర్మానుష్యమైన ప్రదేశాలు, గత నేర చరిత్ర గలిగిన పాత నేరస్తులు, రౌడీలు, సస్పెక్ట్‌లు ఉంటే వారిపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా అరికట్టుటకు వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.రాత్రి వేళ తిరిగే ఆకతాయిల పై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి గస్తీ వేళలో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఏమైనా రక్షణ సహాయం అవసరమైతే భరోసా కల్పిస్తూ, తోడ్పాటును అందించి పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. పోలీసు సిబ్బంది తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అప్పగించిన బీట్ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి:ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి చొర చూపాలని, అదే సమయంలో ఎన్నికల సమయంలో మేనిఫెస్టో పరంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష కోరారు. శుక్రవారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం మేనిఫెస్టో పరంగా, చేసిన హామీల పరంగా ఇంటర్మీడియట్ వరకు చదువుకునే విద్యార్థులకు ఒక ఇంట్లో ఎంతమంది అయితే విద్యార్థులు ఉంటారో అందరికీ కూడా రూ.15 వేల చొప్పున వారి తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పారు. డిగ్రీ విభాగానికి సంబంధించి ఏదైతే గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కేవలం విద్యార్థులకు ఒక విడత విద్యా జీవన మాత్రమే విద్యార్థుల ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఏర్పడినటువంటి టిడిపి ప్రభుత్వం దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనన్న ఆందోళన నెలకొందన్నారు. అప్పట్లో కేవలం ప్రభుత్వానికి అలాగే కళాశాల మేనేజ్మెంట్ కు మాత్రమే ఫీజు విషయంలో ఎటువంటి సంబంధం లేకపోవడంతో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఎదురైయ్యేవి కాదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జగనన్న విద్యా,వసతి దీవెనలు విద్యార్థుల ఖాతాల్లో వేయడం వలన విద్యార్థి అనేక ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వం విద్యార్థి ఖాతాలో విద్యా వసతి దీవెనలు వేయకుండా గతంలో ఇచ్చినట్లు నేరుగా కాలేజీ మేనేజ్మెంట్ ఖాతాల్లో వేయడం వలన విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు డాక్టరు జెట్టిశేషారెడ్డి 16వ స్మారక సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డాక్టరు జెట్టి శేషారెడ్డి 16వ స్మారక సదస్సు నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎం.పుల్లయ్య, శేషారెడ్డి విజ్ఞాన కేంద్ర నిర్వహణ కమిటీ కన్వీనర్ నగేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సుపరిచితులు, డాక్టరు రామచంద్రాడరెడ్డి ప్రజా వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సమయంలో ఎంతో మందికి వైద్యసేవలందించి ప్రాణదాతగా గుర్తింపు పొందిన మహోన్నతమైన వ్యక్తి డాక్టరు జెట్టి శేషారెడ్డి అన్నారు. అటువంటి వ్యక్తి 16వ స్మారక ఉపన్యాసకపు సదస్సును డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్, ప్రజారోగ్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, ఎపి ఎంఎస్ఆర్‌యు, ఎపి ఎంహెచ్ఇయుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శేషారెడ్డిని స్మరించుకుంటూ ప్రతేడాది సదస్సులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆ క్రమంలో ఈ ఏడాది డాక్టరు జెట్టి శేషారెడ్డి స్మారకోపన్యాస సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగం- విలువలు- సవాళ్లు అన్న అంశంపై విశ్రాంత ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని ఉపన్యాసిస్తారన్నారు. అదే విధంగా ఆరోగ్య హక్కు చట్టం 2024 అన్న అంశం పై ప్రజారోగ్య నిపుణులు, పాండిచ్చేరి ప్రాంతానికి చెందిన ప్రపంచ ప్రజారోగ్య సమన్వయకర్త డాక్టరు టి.సుందర్‌రామన్‌లు ప్రసంగిస్తారన్నారు. ప్రజలు, మేధావులు ఈ సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.సమావేశంలో ఎస్ భోగేశ్వరరావు, కె.జయరామిరెడ్డి, వైపి నరసింహారెడ్డి, ఎంవి కృష్ణ, మాదాల రాము, కె.పరందామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగించరూ..

ప్రజాశక్తి -గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరు లో వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీపాలు వెలగకపోవటంతో గుడ్లూరు మెయిన్ బజార్ ,గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మిట్టపాలెం పోయే రహదారిలో స్థానిక బీసీ కాలనీలో ఎం ఎస్ ఆర్ గిరిజన కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. పలు రహదారులలో గుంటల పడి నడవడానికి వీలు లేకపోవడంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. వెంటనే వీధి దీపాలు వెలిగించాలని ప్రజా సంఘాల నాయకులు సిఐటియు అధ్యక్షులు కె.వెంకయ్య,ఆటో యూనియన్ నాయకులు జి.రాజేష్, మహిళా సంఘం నాయకు రాలు ఎస్.విజయలక్ష్మి ఎంపీడీఓ గ్రామపంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

20న ఐఐహెచ్‌టిలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-నెల్లూరు: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కళాశాలలో మూడేళ్ల డిప్లొమో కోర్సులో ప్రవేశాలకు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడేళ్లపాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ వారిచే సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులు మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు చేనేత, జౌళిశాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. మరింత సమాచారం కోసం 9441795408, 9866169908, 9010243054 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రవేశాల కోసం విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో ఈనెల 20న నేరుగా కళాశాలకు హాజరుకావాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ సూచించారు.

మాలకొండకు వెళుతున్న టిడిపి నాయకులు

మాలకొండలో టిడిపి నాయకుల పూజలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: కందుకూరు ఎంఎల్‌గా ఇంటూరి నాగేశ్వరరావు ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆయన సతీమణి సౌజన్య ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభి మానులు శుక్రవారం మాలకొండకు పాదయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే స్వగ్రామం వలేటి వారిపాలెం మండలం, బడేవారిపాలెం నుంచి ఈ మధ్యాహ్నం పాదయాత్ర మొదలుపెట్టారు. ఎమ్మెల్యే సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్‌లు పాద యాత్రలో పాల్గొంటున్నారు. పాదయాత్ర సందర్భంగా బడేవారిపాలెం, ఎస్సీ కాలనీలో ప్రజలు హారతులు పట్టారు. అక్కడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సౌజన్య, ఇతర నాయకులు పూలమాలవేసి నివాళు లర్పిం చారు. వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పెద్ద ఎత్తున మహిళలు యాత్రలో నడుస్తున్నారు.

యువతకు ఆదర్శనీయుడు 'చేగువేరా'

నెల్లూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

త్యాగానికి.. పోరాటానికి..నేటి తరం యువతకు ఆదర్శనీయుడు విప్లవకారుడు చేగువేరా అని డివైఎఫ్ఐ నగర కమిటీ కార్యదర్శి బి.పి.నరసింహ అన్నారు. శుక్రవారం డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో 11వ డివిజన్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలో ప్రపంచ యూత్ ఐకాన్ యువ విప్లవకారుడు చేగువేరా 96వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి నగర కార్యదర్శి నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు 1928 జూన్ 14న అర్జెంటీనా దేశంలో జన్మించినప్పటికీ చిన్నతనం నుంచే సాహిత్యం వైపు ఆకర్షితులై సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. వాస్తవానికి వైద్య విద్యనభ్యసిస్తున్నప్పటి రోజుల్లో లాటిన్ అమెరికా దేశాల్లోని పర్యటించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భరమైన పరిస్థితులను చూసి చలించి పోయారన్నారు. క్యూబాను సామ్రాజ్యవాదం నుంచి రక్షించుకోవడానికి కాస్ట్రో నాయకత్వం లో జరుగుతున్న విప్లవ పోరాటంలో పాల్గొని దళ కమాండర్ గా వ్యవహరించారన్నారు. ఆ పోరాటంలో దేశాన్ని సామ్రాజ్యవాద తొత్తుల నుండి విముక్తి చేయడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. క్యూబాలో జాతీయ బ్యాంక్ అధ్యక్షుడుగా, పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహ రించి క్యూబా పై సామ్రాజ్యవాద దేశాలు ముఖ్యంగా అమెరికా అనేక ఆంక్షలను విధించినప్పటికీ ప్రజల మద్దతుతో అక్కడ అందరికీ విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. 1967 అక్టోబరు 9వ తేదీన నది దాటుతున్న సమయంలో సిఐఏ ఏజెంట్లు చేగువేరాను బంధించి శరీర భాగాలన్నీ ముక్కలు ముక్కలు చేసి దుర్మార్గంగా చంపి వేశారన్నారు. చేగువేరా ప్రపంచంలో ఎవరికి ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించడానికి సిద్ధంగా ఉండు అని చెప్పడమే కాదు ఆచరణలో చేసి చూపిన వ్యక్తి అని తెలిపారు. త్యాగానికి, పోరాటానికి, ఆదర్శానికి నిలువెత్తు నిదర్శనం చేగువేరా అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ స్థానిక కమిటీ కార్యదర్శి కె. బాబు, స్థానిక నాయకులు సాయి గణేష్, శేఖర్, ప్రవీణ, మధు, సాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

చేగువేరా 96వ జయంతి సందర్భంగా బుద్ధ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జయంతి శుక్రవారం జరిగింది. తొలుత చేగువేరా చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న పాలపిట్ట దీర్ఘకావ్య రచయిత ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ చేగువేరా విద్యార్థి దశలోనే లాటిన్ అమెరికా అంత పర్యటించి పేదలు వారి కష్టాలను, వారి జీవితాలను చూసి చలించిపోయి సమ సమాజం వైపు అడుగులు వేశారు. ప్రకాశం, నెల్లూరు సంయుక్త జిల్లాల ఉపాధ్యక్షుడు చేవూరు దుర్గాప్రసాద్, బహుజన నాయకుడు ముతకాని లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ముందుగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఎంఎల్ఎ 'కోటంరెడ్డి'కి అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు

2024 సార్వత్రిక ఎన్నికల్లో మూడవసారి నెల్లూరు రూరల్ శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం రూరల్ ఎంఎల్ఎ కార్యాలయానికి చేరుకున్న మెడికవర్ వైద్యశాల సిబ్బంది కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ బాబు, పిఆర్ఓ చందు వర్మలు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని ఉదయగిరి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ రెడ్డి, ఎం.ఫణి రాజు, గాజులపల్లి సుబ్బారెడ్డి, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని పలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలను ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.గోపాల్ తనిఖీ చేశారు. ముందుగా మండలంలోని బసినేనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఎంఇఒ ఎస్‌కె మస్తాన్ వలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అంజయ్య, శ్రీనివాసులు తదితరులున్నారు.

పాఠశాలలో ఎంఇఒ పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పడ్లీపాలెంలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఇఒ ఎంవి జానకిరామ్ సందర్శించారు. హాజరు పట్టికను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. డ్రాప్ అవుట్స్ గుర్తించి చేర్పించాలన్నారు.

ప్రశాంతంగా జీవించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : గ్రామాల్లో అల్లర్లు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని కావలి డిఎస్‌పి వెంకటరమణ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ఉండేందుకు కొండ బిట్రగుంట, ముంగమూరు పంచాయతీలలో శుక్రవారం కావలి డిఎస్‌పి గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కావలి రూరల్ సిఐ నాగభూషణం, బిట్రగుంట ఎస్ఐ బొజ్జ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఆత్మకూరు ఆర్‌టిఒ పరిధిలోని స్కూల్ వ్యాన్‌లకు శుక్రవారం ఎంవిఐ రాములు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 78పాఠశాలల బస్సులు ఉండగా ఇప్పటి వరకు 60బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇచ్చినట్లు, మిగిలిన 18వాహనాలను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. ఆయనతోపాటు సిబ్బంది ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : భూసారం, నేలలో సేంద్రీయ రూపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ద్వారా 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను రైతులకు మండలంలోని నువ్వూరుపాడు గ్రామ రైతులకు అందజేసినట్లు వ్యవసాయ అధికారి కిషోర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో రైతులు ప్రజలున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో 100శాతం సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎ.అంజనేయులు నాయక్ పేర్కొన్నారు. కావాల్సిన రైతులు తమ ఆర్‌బికేలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి-సీతారామపురం : మండలానికి పొద్దుతిరుగుడు విత్తనాలు మినికిట్ రూపంలో 100 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను కలిసి విత్తనాలను పొందవచ్చని తెలిపారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం నడిబొడ్డున ఉన్న అమృత్ పథకం పైలాన్‌ను 2020 ఏప్రిల్ 10న అర్థరాత్రి సి.సి. కెమెరాలు ఉన్నా వాటిని ఆపి, పైలాన్‌ను కూల్చివేశారని, అందుకు కారకులైన వారు ఎవరో వారిని శిక్షించాల్సిందేనని బిజెపి రాష్ట్ర నాయకులు గుండ్లపల్లి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బిజెపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, మామిడి వెంకటేశ్వర్లు, మందా కిరణ్ కుమార్, పరుసు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మస్తాన్, రాకేష్, జయకుమార్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ శీనానాయక్ పాల్గొని, రక్తదాతలను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, 1వ పట్టణ సిఐ రాజేష్, రక్తదానం చేసే రక్తదాతలకు మనోధైర్యాన్ని కల్పించారు. అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి.రామసిద్దార్ధ, 70మంది రక్త దాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఇద్దరు మహిళలను ఆంధ్రప్రదేశ్ క్యాన్సర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, అభినందించారు. కార్యక్రమంలో వి సేవా ఫౌండేషన్ ఫౌండర్ వినయ్‌కుమార్, రహీం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మహమ్మద్ అబ్దుల్ అలీం, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బీ, గుడ్‌మిన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సోమిశెట్టి బ్రహ్మయ్య, బ్రెం టు పెర్ల్ ట్రస్ట్ ఫౌండర్ రమేష్, ప్రపంచ మానవ హక్కుల అసోసియేషన్ సంఘం దక్షిణాంధ్ర మహిళా రీజినల్ ఛైర్‌పర్సన్ అనుమాలశెట్టి కామాక్షి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే కోసం 'రైల్ రోకో'

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట రైల్వే ప్రగతి కోసం భవిష్యత్తులో రైల్ రోకో కూడా సిద్ధమని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ బిట్రగుంట అభివృద్ధి కోసం బోగోలు విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీలోని ప్రజలందరిని ఐక్యం చేసి "రైల్ రోకో" చేయడానికి సమాయత్తమవుతున్నాం. కాబట్టి ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు బిట్రగుంట రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు చింకపాటి వెంకటేశ్వర్లు, షేక్ జమీర్ వార్డ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శశి కుమార్, మానవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్, ప్రజా భీమ్ అంబేద్కర్ వ్యవసాయ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ, వార్డు సభ్యులు ఆరోగ్యరాజ్, శ్యామ్, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆనం'తో ఆలయాలు అభివృద్ధి

ప్రజాశక్తి-అనంతసాగరం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా కేటాయించడంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలు అభివృద్ధి చెందుతాయని మండల టిడిపి సీనియర్ నాయకులు పాతపాటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'కాకర్ల'ను కలిసిన ఎపిఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ను ఏపీ ఎన్‌జిఒ తాలూకా అధ్యక్షుడు జెవిపి చైర్మన్ బొమ్ముబత్తు శ్రీహరి ఆధ్వర్యంలో తమ బృందంతో ఎంఎల్‌ఎను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం వింజమూరులోని టిడిపి ప్రధాన కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగ సంఘాల తరఫున ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సంఘం సెక్రటరీ రియాజ్, జలీల్‌బాషా, ప్రెసిడెంట్ గాజుల సుమ పాల్, డి. రామ్మోహన్, కొండయ్య, వెంకటాద్రి, బాలాజీ, నాగేంద్ర, వెంకట్రావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి-కోవూరు : సేంద్రియ ఎరువులను వినియోగించుకుని రైతులు సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ అధికారులు సూచనలు చేశారు. పవిత్రవృత్తిగా భూసారం పెంపొందించాలని ఏపిఎం రాజశేఖర్ అన్నారు. మండలంలోని సంఘమిత్ర కార్యాలయంలో శ్రీ సాయి స్వచ్ఛంద సేవ సమస్త ఆధీనత జీపి జవహార్ సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపిఎం రుక్మిణి, సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవళిక, మండల ఆర్గనైజర్ మునెమ్మ పాల్గొన్నారు.

ఇంటి బయట మీటర్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : విద్యుత్ వినియోగదారుల (గృహ,వాణిజ్య) ప్రతి ఒక్కరూ ఆరుబయట మాత్రమే మీటర్స్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు వి.విజయన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విద్యుత్ భవన్ లో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి : కావలి రైల్వే రోడ్డులో ఉన్న గీతామందిరంలో శ్రీ కృష్ణుడికి శుక్రవారం లక్ష మల్లెల పూజ శోభాయమానంగా వందలాది మంది మహిళలతో నిర్వహించారు. ఉభయదాతలుగా నున్నా మాలాద్రి, ఆదిలక్ష్మి దంపతులు, వారి కుమారులు, ఆయన తమ్ముడు నున్నా మాలకొండయ్య - అంజనీ కుమారిలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా 30వ వార్డ్ టిడిపి ఇన్‌ఛార్జ్ గంధంశెట్టి వేణుగోపాల్, మిత్రులు పాపర్తి నాగరాజు, పెనుబల్లి శ్రీనివాసులు, కుమార్, పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సోమిశెట్టి పెద్ద వెంకటసుబ్బారావు, అన్నమూరి వెంకటసుబ్బారావు, పోలిశెట్టి ఆదినారాయణ, కొంజేటి రామ్మూర్తి, గట్టుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న స్వీపర్లు

ప్రజాశక్తి-కావలి రూరల్

కావలి ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లో స్వీపర్లుగా పనులు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామకృష్ణకు అర్జీనిచ్చారు. అనంతరం సిఐటియు నాయకులు పసుపు లేటి పెంచలయ్య మాట్లాడుతూ కావలి ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లో 15 సంవత్సరాలు పైబడి స్వీపర్లుగా కార్మికులు పనులు చేస్తు న్నారని, వారికి తక్కువ జీతాలు ఇస్తూ ఎక్కువ పనులు చేస్తున్నారన్నారు. జీతాలు కూడా ప్రతినెలా పదో తేదీ లోపల ఇవ్వాల్సి ఉండగా, ఇవ్వడం లేదని, రెండు మూడు నెలలకు ఒకసారి ఒక జీతం ఇస్తున్నారన్నారు. దానివల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. వారికి పిఎఫ్, ఇఎస్ఐ కటింగ్ పోనూ రూ.9900 నెలకు జీతం ఇవ్వాల్సి ఉండగా ఆ కాంట్రాక్టర్ రూ.9వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటు న్నాడని విమర్శించారు. అంతేకాకుండా వీరి పేరుతో జమ చేస్తు న్న పిఎఫ్ రసీదులు సంవత్సరానికి ఒకసారి కార్మికులకు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేద న్నారు. ఇఎస్ఐ కార్డులు కూడా ఇంతవరకూ ఇవ్వలేదని అసలు పిఎఫ్ ఇఎస్ఐ కార్మికుల పేరుతో జమవుతున్నదో.. లేనిదో.. తెలియడం లేదన్నారు. ముఖ్యంగా కార్మికులకు ఇవ్వాల్సిన సెలవులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆరు నెలలకు ఒకసారి విడుదలయ్యే నోటిఫికేషన్ బోర్డు కార్మికులకు తెలియపరచాల్సి ఉన్నప్పటికీ అది జరగడం లేదని తెలిపారు. దానివలన కార్మికులు నష్టపోతున్నారని సంస్థ ద్వారానే జీతాలు ఇవ్వాలని పిఎఫ్ రసీదులను కార్మికులకు ఇవ్వాలని ఇఎస్ఐ కార్డులలో కుటుంబ సభ్యులందరినీ చేర్చి కార్మికుల సమస్యలన్నిం టినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందన్నారు. సిఐటియు నాయకులు జి మధుసూదన్ రావు, బి కృష్ణయ్య, స్వీపర్లు పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూళ్లలో తనిఖీలు

- ప్రజాశక్తి కథనానికి స్పందన
- విద్యార్థి సంఘాల ఆవేదనపై సూచనలు

రికార్డులు పరిశీలిస్తున్న బృందం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఇటీవల ప్రజాశక్తిలో ప్రయివేటు పాఠశాలల్లో అదనపు భారం తగ్గించాలని విద్యార్థుల సంఘాలు ఆవేదనతో వచ్చిన కథనంలో భాగంగా ప్రయివేటు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.గోపాల్ శుక్రవారం స్థానిక హోలీ ఏంజెల్స్ సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం ప్రయివేటు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం నిర్ధేశించిన పాఠ్య పుస్తకాలతో మాత్రమే బోధన జరపాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత ఉన్న ఉపాధ్యాయుల తో బోధన చేయించాలని, వాహనాల్లో వచ్చు విద్యార్థుల భద్రత దృష్ట్యా వాహనాల రిజిస్ట్రేషన్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని, అన్ని రికార్డులు రిజిష్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా ఉంచాలని కరస్పాండెంట్‌కు ఆదేశాలు చేశారు. కార్యక్రమంలో మండల తనిఖీ బృందంలోని సభ్యులైన ఎంఇఒలు షేక్ మస్తాన్ వలీ, తోట శ్రీనివాసులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు బాలకేశవులు, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మందుబాబులకు అడ్డాగా ఉన్నత పాఠశాల అనే శీర్షికతో ప్రజాశక్తి వార్తాపత్రికలో వచ్చిన వార్తకు స్పందిస్తూ ఇందుకూరుపేట మండల విద్యాశాఖ అధికారులు సునీల్, ఎస్‌వి నాయక్ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, పిఇటి మిజిర్, వాచ్‌మెన్‌లతో సమావేశమై సదరు విషయంపై చర్చించి మళ్లీ అసాంఘిక కార్యకలాపాలు పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిందిగా సూచనలు ఇచ్చారు.

విత్తనాల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కొండమీద కొండూరు గ్రామంలో ఆర్‌బికె వద్ద 21 రకాల విత్తనాలు పచ్చిరొట్ట వాడటం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆర్‌బికె విఎఎ సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సారవంతం అవడమే కాకుండా, భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అంది నాణ్యమైన పంటకు దోహద పడుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం పూర్తిగా తగ్గి రైతుకు ఖర్చులు తగ్గి అధిక లాభాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, రైతులు, సర్పంచ్, ఎపిసిఎన్ఎఫ్ సిబంది, ఎంటిఎ వెంకటలక్ష్మి, మండలం ఇన్‌ఛార్జ్ ఎల్2 సుబ్బారాయుడు, ఎల్3 బీబీజాన్, ఐబి ఐసిఆర్‌పి కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'ఆనం'ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం విజయవాడలో ఆత్మకూరు బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, ప్రముఖ వ్యాపారి హరికృష్ణ తదితరులున్నారు.

బక్రీద్ ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-విడవలూరు : ముస్లిములకు పరమ పవిత్రమైన బక్రీద్ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వసతులు కల్పించాలని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని తన కార్యాలయంలో నియోజకవర్గ మండలాల ఎంపిడిఒలు, ఇతర అధికారులు, ముస్లిం, మైనార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం బక్రీద్ సందర్భంగా కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు ప్రార్థనలు చేస్తారని, వారి కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. మండలాల ఎంపిడిఒలు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహం తొలగించాలి

- యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత

పోలీసులతో మాట్లాడుతున్న వెంకటాద్రి

ప్రజాశక్తి-వెంకటాచలం : మండలంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. శుక్రవారం టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున విశ్వవిద్యాలయం వద్దకు చేరుకున్నారు. యూనివర్సిటీలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని ఇదివరకే కోరామని కానీ ఇంతవరకు ఎందుకు తొలగించలేదని వీసీని వెంకటాద్రి ప్రశ్నించారు. వీసీ సరైన సమాధానం చెప్పకపోవడంతో ప్రతిచర్యగా యూనివర్సిటీ భవనం వద్ద ఫ్లెక్సీ కట్టేందుకు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పూనుకున్నారు. ఈ సమాచారాన్ని యూనివర్సిటీ అధికారులు జిల్లా ఎస్‌పికి చేరవేశారు. దాంతో ఎస్‌పి ఆదేశాలతో తొలుత వెంకటాచలం ఎస్ఐ, పోలీసు సిబ్బంది రంగంలోకి దిగారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వెనుదిరగకపోవడంతో సిఐ అంకమరావు యూనివర్సిటీ వద్దకు చేరుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వినక పోవడంతో అనంతరం నెల్లూరు రూరల్ డిఎస్‌పి వీరాంజనేయులు రెడ్డి రంగంలోకి దిగారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులతో మాట్లాడి వైఎస్ విగ్రహాన్ని వీలైనంత త్వరగా తొలగిస్తామని చెప్పించడంతో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు శాంతించారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, అశోక్, సురేష్, మహేష్, పెంచలప్రసాద్, సాయి, కె.పవన్, సూర్య, హర్ష, నవీన్, ప్రకాష్, వెంకటేష్, డేవిడ్ రాజు, మనోజ్, పవన్, నితీష్ పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-కావలి : దేశంలో 70కోట్ల మంది యువకులు ఉన్నారని, వారు జీవితంలో కనీసం ఒకసారి రక్తదానం చేసినా, దేశంలో రక్తానికి కొరత ఉండదని కావలి ఆర్‌డిఒ వికె శీనానాయక్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో ప్రపంచ రక్తదాన ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కావలి తహశీల్దార్ నాగేష్, కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో ఆర్‌డిఒ మాట్లాడారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఆర్‌డిఒ ప్రారంభించగా, వాయిస్ అఫ్ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మొగల్ సలీం బేగ్, మొగల్ రహీమ్ బేగ్ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. కావలి ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, టీం సేవియర్స్ అధ్యక్షులు ప్రణీత్, ఆద్వి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసన్నకుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు హరినారపరెడ్డి, రఘుకుమార్ రెడ్డి, ప్రసన్నాంజనేయులు, సుధీర్ నాయుడు, లోకేశ్వరరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, పూనూరు మురళీధర్‌రెడ్డి, సాయిప్రసాద్, హనుమ కుమార్, షమా రహీమ్, జమున పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కావలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి కావలి ఎం.ఎల్.ఎ. కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మాట చెప్పాడంటే.. వెంటనే చేస్తాడన్నారు. పాలనా పగ్గాలు చేపట్టిన మొదటి రోజే ఐదు హామీలపై సంతకాలు చేయడంతో కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి పట్టణాధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, నాయకులు వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, అక్కిలిగుంట సూర్యప్రకాశ రావు, పొట్లూరు శ్రీనివాసులు, హజరత్, నున్నా మురళి, రఫీ, కమర్‌బాబు, జనసేన నాయకులు పోబ్బా సాయి విఠల్, ఆలా శ్రీను, తోట శరన్ కుమార్, బిజెపి నాయకులు, అవ్వాతాతలు పాల్గొన్నారు.

టిడిపి ఫ్లెక్సీ చింపివేత

-ఇస్కపాలెంలో అలజడి..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దాంతో టీడీపీ నాయకులు, కార్య కర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...ఎన్నికలలో తెలుగు దేశం (కూటమి), ముఖ్యంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అఖండ విజయాన్ని పురస్కరించుకొని అభిమానులు ఆయన ఫొటోతో మండలంలో ఇస్కపాలెం గ్రామం సెంటర్లో భారీ సైజ్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో చంద్రమోహన్ రెడ్డి అభిమానులకు సంబంధించిన ఫొటోల్లో సరిగ్గా మెడ భాగంలో గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడ్‌తో కట్ చేశారు. ఈ ఘటన గ్రామంలో వివాదానికి దారితీస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఫ్లెక్సీ ధ్వంసంతో తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితితో గ్రామంలో అలజడి నెలకొంది. ఈనేపథ్యంలో పోలీసులు చొరవ తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. 2019 ఎన్నికలలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వారు ధ్వంసం చేయడానికి ప్రతీ కారంగా టీడీపీ ఫ్లెక్సీని చింపి వేయడం జరిగిందన్న ప్రచారం జరుగు తుండడం గమ నార్హం. ఏదేమైనా టీడీపీ ఫ్లెక్సీని కత్తిరింపునకు గురైన ఘటన ప్రస్తుతం మండలంలో హాట్ టాపిక్ అయింది.

అభివృద్ధి దిశగా సిఎం అడుగులు

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి అడుగు వేశారని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సిఎంగా చంద్రబాబు నాయుడు గురువారం తొలి 5 సంతకాలు మెగా డిఎస్‌సి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సస్ ఫైల్స్‌పై సంతకాలు చేయడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రజాసంక్షేమం కోసం రంగంలోకి దిగడం చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమైందన్నారు. ముందుగా కోవూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, తిరుమూరు అశోకరెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, ఇంత మాలరెడ్డి, ఎంపిటిసి యాదలపూడి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని గండిపాలెంలో ఉన్న చెంచురామయ్య జలాశయంలో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెంగళరావునగర్ గ్రామానికి చెందిన షేక్.అలీ (30)గా మృతదేహాన్ని గుర్తించారు. ప్రమాదవశాత్తు మృతి చెందాడని లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించే అలీ అందరితోనూ సఖ్యతగా ఉండే వ్యక్తి అని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని స్థానికులు అంటున్నారు. మృతునికి భార్య హసీనా, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి సంఘటి స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఆత్మకూరు ఆర్‌టిఒ పరిధిలోని స్కూల్ వ్యాన్‌లకు శుక్రవారం ఎంవిఐ రాములు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలకు చిన్నారులను తీసుకెళ్లే వాహనాలు కావడంతో వాటిలో ఏ చిన్నలోపం లేకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 78పాఠశాలల బస్సులు ఉండగా ఇప్పటి వరకు 60బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇచ్చినట్లు, మిగిలిన 18వాహనాలను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల యాజమాన్యం వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేయించి పూర్తి కండిషన్‌లోకి తీసుకురాగానే వాటికి కూడా ఎఫ్‌సి ఇవ్వనున్నట్లు తెలిపారు. సిబ్బంది ఉన్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డికి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవి దక్కడంతో ఆత్మకూరులో తెలుగు తమ్ముళ్ల హర్షం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో శుక్రవారం సాయంత్రం స్థానిక బిఎస్ఆర్ సెంటర్‌లో టిడిపి నేతలు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు రామనారాయణరెడ్డి కృషి చేస్తారని తెలిపారు. ఆనం రామనారాయణ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమూచిత స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సెంటర్లో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజారెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రా రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి, కేత విజయభాస్కర్ రెడ్డి, తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, మాజీ ఎంపిటిసి గార్లపాటి వేణుగోపాల్ నాయుడు, చంద్ర వెంకటసుబ్బ నాయుడు, కౌన్సిలర్లు సూరా భాస్కర్ రెడ్డి, గౌస్‌బాషా, బుజ్జి రెడ్డి, దాసరి మధు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పోలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఇందుకూరుపేట మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి అన్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో విజయోత్సవం సంబరాల్లో భాగంగా టిడిపి యువనాయకులు దువ్వూరు కళ్యాణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొన్నబోయిన చెంచుకిషోర్, కొండూరు సుధాకర్ రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మునగాల రంగారావు, గుండాల కృష్ణారెడ్డి, మైనారిటీ నేత ఇంతియాజ్, బొద్దుకూరు సుధీర్, పామాంజి నరసింహ, లెనిన్, ఈదూరు చెన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : ఇచ్చిన మాట ప్రకారం మొట్టమొదటి సంతకం మెగా డిఎస్‌సి, అన్న క్యాంటీన్, పింఛన్ల పెంపు, నైపుణ్యత కేంద్రాలు, ల్యాండ్ టైటిల్ ఆడ్ రద్దు అనే ఐదు విధానాలపై ముఖ్యమంత్రి సంతకం చేసినందుకు, కోవూరు నియోజకవర్గ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలు మేరకు టిడిపి నేతలు చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. మండల ప్రజాపరిషత్ అధికారి ముందుగా లబ్ధిదారులతో కేక్ కట్ చేయించి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధికారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జె.బి. విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-కావలి

విక్రమ సింహపురి యూనివర్సిటీ నుండి ఎన్.ఎస్.ఎస్. జాతీయ శిబిరానికి కావలి జె.బి.కాలేజీ 3వ బి.ఎస్‌సి. సి బి జెడ్ విద్యార్థిని ఎంపికైంది. అందుకు కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు సిటీ యూనివర్సిటీలో ఈ ఎన్.ఎస్.ఎస్. జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మాల్యాద్రి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లు పి.భాస్కరరావు, షేక్.అయూబ్ అహమ్మద్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పాల్గొని, విద్యార్థిని ఘనంగా అభినందించారు.

పలుచోట్ల 'బడిబాట'

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని తిమ్మారెడ్డిపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో బడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త షేక్.రజియా మాట్లాడుతూ అందరూ 3 నుండి 6 సంవత్సరాల పిల్లలను అంగన్ వాడీకి పంపాలని, ఈ విద్యాసంవత్సరం నుండి నర్సరీ, వన్ కేజీ, యూకేజీ సెక్షన్‌లు వారీగా ఇంగ్లీష్ మీడియం రానుందని కావున గ్రామస్తులు తమ పిల్లలను అంగన్‌వాడీకి తప్పకుండా పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు లాసర్, ఆయా కె.కృష్ణకుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని కొండాయపాలెం, వెంకటరావు పల్లి, దుర్గంపల్లి, గంగిరెడ్డిపల్లి, గానుగ పెంట, పట్టణంలోని వాల్మీకి వీధి, కోళ్ల వీధి, కరీమా వీధి అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. వారి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని ప్రతీ ఇంటికీ వెళ్లి పిల్లలను గుర్తించి వారికి సూపర్‌వైజర్ షాను అంగన్‌డీ సెంటర్‌ల ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లలతో కలిసి అంగన్‌వాడీ సందర్శన చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సి హెచ్ వి రత్నమ్మ, ప్రమీల, జయలక్ష్మి మహబూబ్ జానీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు మండల పరిధిలోని కావలి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు బడిబాట కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన చెంచలబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టిడిపి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ మాజీ జెడ్పి పరిషత్ చైర్మన్ చెంచల బాబు యాదవ్ కలిశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడును ఆయన కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి సంతకాలపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు రాక్షస పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి చెంది ఉన్నారని చంద్రబాబు ప్రమాణస్వీకారంతో ఊపిరి పీల్చుకున్నారని నేటి నుండి రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు సుపరి పరిపాలన అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఎక్కడ చూసినా అన్ని విధాలుగా సంబరాలు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా చేసుకుంటూ టిడిపి ఘనవిజయాన్ని చాటుతున్నారన్నారు.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం - గుండెమడకల

ROC No: 01 / 2024 **తేది: 14-06-2024**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గుండెమడకల గ్రామ పంచాయతి నందు మంచినీటి సరఫరా నిర్వహణ కొరకు కాంట్రాక్టు పద్దతిపై PWS స్కీమ్ ఆపరేటర్ కమ్ వాచ్‌మెన్ పోస్టు-1, గ్రామ పంచాయతి కార్యాలయ పారిశుధ్య నిర్వహణ (స్వీపరు) కు పోస్టు-1, ఒక సం॥ కాల పరిమితి అనగా **తేది: 01-04-2024 నుండి 31-03-2025** వరకు నిర్వహించుటకు **తేది: 24-06-2024** న **ఉదయం : 11:00 గం॥ల** నుండి **మధ్యాహ్నం 2:00 గంటల** వరకు గ్రామ పంచాయతి కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి కలవారు **రూ.500/-** ధరావత్తు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు పరచవచ్చును. మిగిలిన వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.

పి.పెంచలయ్య, పంచాయతి కార్యదర్శి
గుండెమడకల గ్రామ పంచాయతి, వింజమూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం - నల్లగొండ్ల

ROC No: 01 / 2024 **తేది: 14-06-2024**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామ పంచాయతి నందు కాంట్రాక్టు పద్దతిపై మంచినీటి నిర్వహణకు పంప్ ఆపరేటర్ పోస్టు-1 ఒక సం॥ కాల పరిమితి అనగా **తేది: 01-04-2024 నుండి 31-03-2025 వరకు** నిర్వహించుటకు **తేది: 24-06-2024** న **ఉదయం : 11:00 గం॥ల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు** గ్రామ పంచాయతి కార్యాలయం నందు టెండర్లు నిర్వహించబడును. ఆసక్తి కలవారు **రూ.500/-** ధరావత్తు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు పరచవచ్చును. మిగిలిన వివరములకు ఈ క్రింది వారిని సంప్రదించవలెను.

షేక్.సుల్తాన్ షరీఫ్ బాషా, పంచాయతి కార్యదర్శి
నల్లగొండ్ల గ్రామ పంచాయతి, వింజమూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.